RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి -13 సంచిక - 394 | 05 శుక్రవారం జూన్ 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

## 50 నుంచి 100 శాతం భూముల విలువ పెంపు

### : కీలక వివరాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి



తెలంగాణలోని పలు ప్రాంతాల్లో భూముల విలువలు 50 నుంచి 100 శాతం వరకు పెరగనున్నాయని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఈ నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాకు అదనంగా సుమారు రూ.1,400 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నట్టు తెలిపారు. తెలంగాణలో భూముల మార్కెట్ విలువలను సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. జూన్ 5వ తేదీ నుంచి సవరించిన కొత్త రేట్లు అమల్లోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ, వాస్తవ మార్కెట్ ధరలకు అనుగుణంగా ప్రభుత్వ విలువలను సవరించాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. ముఖ్యంగా అధిక డిమాండ్ ఉండే శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, ఖాజాగూడ వంటి ప్రాంతాల్లో పెంపు ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. అయితే, రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచే ఆలోచన లేదని మంత్రి స్పష్టం చేశారు. అదే సమయంలో, పరిపాలనలో పారదర్శకత పెంచేందుకు సబ్-రిజిస్ట్రార్ల అధికారాలను గణనీయంగా తగ్గించినట్టు తెలిపారు. కొత్త రేట్లపై ప్రజల సందేహాలు, ఫిర్యాదుల కోసం ప్రత్యేకంగా ఒక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయనున్నట్టు హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ హయాంలో అసైన్డ్ భూములకు రిజిస్ట్రేషన్లు జరిగాయని అన్నారు. తమ ప్రభుత్వం వాటిని నిషేధిత జాబితాలో పెట్టిందని అన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం గురించి కూడా మంత్రి మాట్లాడారు. ఈ పథకం కోసం ఇప్పటివరకు రూ.7,000 కోట్లు విడుదల చేశామని, ఒకవేళ కేంద్రం నుంచి నిధులు రాకపోయినా రాష్ట్ర ప్రభుత్వమే బిల్లులు చెల్లించి ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తుందని భరోసా ఇచ్చారు.

## తెలంగాణను అస్థిరపరిచే రాజకీయాలకు నేను వ్యతిరేకం

### : పవన్ కల్యాణ్



తెలంగాణను అస్థిరపరిచే రాజకీయాలకు తాను ఎన్నడూ మద్దతు ఇవ్వలేదని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పరస్పర గౌరవం, శాంతి, సహకారంతో రెండు తెలుగు రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడాలన్నదే తన అభిమతమని ఆయన తేల్చిచెప్పారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తాను చేసిన వ్యాఖ్యలపై నెలకొన్న వివాదంపై ఆయన గురువారం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షల పట్ల తన వైఖరి రాష్ట్ర విభజన నాటి నుంచి ఇప్పటివరకూ మారలేదని పేర్కొన్నారు. విభజన తర్వాత తాను 'సెక్షన్ 8' అమలును వ్యతిరేకించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఇది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, స్వయంపాలనా హక్కును దెబ్బతీస్తుందనే భావనతోనే ఆనాడు ఆ విధంగా స్పందించానని వివరించారు. ఇరు రాష్ట్రాల మధ్య విశ్వాసాన్ని పెంపొందించే యంత్రాంగాలు ఉండాలని తాను సూచించినట్లు తెలిపారు. తన పూర్వ వైఖరిని ధ్రువీకరించే పాత వీడియో క్లిప్‌ను కూడా ఆయన ఈ పోస్టుకు జతచేశారు. గతంలో జూన్ 2న గచ్చిబౌలిలో జనసేన సభకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో, పవన్ కల్యాణ్ తన నివాసంలో మీడియా సమావేశం నిర్వహించిన సంగతి తెలిసిందే. ఆ సందర్భంగా, తెలంగాణలో 2029 అసెంబ్లీ ఎన్నికలతో పాటు జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ జనసేన పోటీ చేస్తుందని ఆయన ప్రకటించారు. అయితే, 'అతివాద ప్రాంతీయత'పై ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా పెను దుమారం రేపాయి. పవన్ వ్యాఖ్యలపై తెలంగాణ అధికార పక్షమైన కాంగ్రెస్‌తో పాటు ఇతర పార్టీల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. మంత్రి పొన్నం ప్రభాకర్ సహా పలువురు నేతలు స్పందిస్తూ.. సుదీర్ఘ ఉద్యమాల ద్వారా సాధించుకున్న తెలంగాణలో ఇక్కడి వ్యవహారాల్లో ఇతరుల జోక్యం తగదని హితవు పలికారు. ఈ రాజకీయ పరిణామాల నేపథ్యంలోనే పవన్ కల్యాణ్ తాజాగా వివరణ ఇచ్చారు.

## రూపాయి కూడా తేలేదు

### : కిషన్ రెడ్డి, బండి సంజయ్ లపై కడియం శ్రీహరి ఫైర్



కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లతో పాటు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తన క్యాంప్ ఆఫీస్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడిన ఆయన.. కేంద్ర మంత్రులు ఇద్దరూ తెలంగాణ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా అదనంగా తీసుకురాలేదని, వారి వల్ల రాష్ట్రానికి ఎలాంటి ఉపయోగం లేదంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.



## అమీర్‌పేటలో భారీ అగ్ని ప్రమాదం..

నిత్యం రద్దీగా ఉండే హైదరాబాద్ అమీర్‌పేటలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మైత్రివనం దగ్గర్లోని కేఎస్ఆర్ షాపింగ్ మాల్‌లో మంటలు చెలరేగాయి. తొలుత ఓ ఆటబొమ్మల దుకాణంలో చెలరేగిన మంటలు క్రమంగా షాపింగ్ కాంప్లెక్స్ మొత్తం వ్యాపించాయి. పెద్ద ఎత్తున ప్లాస్టిక్ వస్తువులు ఉండడంతో మంటలు వేగంగా అంటుకున్నాయి. మైత్రివనం ప్రాంతంలో అనేక ఆఫీసులు, కోచింగ్ సెంటర్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు ఉంటాయనే విషయం తెలిసిందే.
మంటల ధాటికి ఆ ప్రాంతమంతా పెద్ద ఎత్తున పొగ అలముకుంది. రోడ్డు కనపడనంత తీవ్రంగా పొగ కమ్మేయడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నాయి. నాలుగు ఫైరింజన్లు మంటలను ఆర్పుతున్నాయి. మరోవైపు పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. మంటలు చెలరేగిన వెంటనే షాపింగ్ కాంప్లెక్స్‌లోని వారంతా బయటకు పరిగెత్తుకొచ్చారు. దీంతో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని ప్రాథమికంగా పోలీసులు తేల్చారు. కానీ, చాలా దుకాణాలు దగ్ధం అవడంతో ఆస్తి నష్టం మాత్రం భారీగా ఉండే అవకాశం ఉంది. అలాగే షార్ట్ సర్క్యూటే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని అనుమానిస్తున్నారు. మరోవైపు సమీపంలోనే మెట్రో స్టేషన్‌లో కార్యకలాపాలకు ఎలాంటి అంతరాయం లేదని అధికారులు తెలిపారు. సర్వీసులు యథావిధిగా కొనసాగుతున్నట్లు చెప్పారు.

## చంచల్‌గూడ జైల్లో బాల్క సుమన్‌ను కలిసిన కేటీఆర్



చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈరోజు ములాఖత్‌లో కలిశారు. కేటీఆర్‌తో పాటు పార్టీ సీనియర్ నేతలు తలసాని శ్రీనివాస్ యాదవ్, సుధీర్ రెడ్డి కూడా బాల్క సుమన్‌ను పరామర్శించిన వారిలో ఉన్నారు. జైల్లో ఉన్న సుమన్‌కు పార్టీ పూర్తి అండగా ఉంటుందని ఈ సందర్భంగా కేటీఆర్ భరోసా ఇచ్చారు.

అసలు కేసు నేపథ్యం ఏంటి?

సింగరేణి కాలరీస్ ఆస్తులను ధ్వంసం చేయాలంటూ, రైలు పట్టాలు కోసేయాలంటూ బాల్క సుమన్ ఇటీవల రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో ఆయనపై నాంపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ తర్వాత ఈ కేసును బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. గడిచిన మే 26న తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నిర్వహించిన బహిరంగ సభలో బాల్క సుమన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని పేర్కొంటూ.. సింగరేణి కాలరీస్‌కు చెందిన జూనియర్ అసిస్టెంట్ ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ అరెస్ట్ చర్యలు చేపట్టారు.

## పవన్ సభకు అనుమతి ఎందుకు ఇవ్వలేదు?

### : తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామ్‌చందర్ రావు



తెలంగాణలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ సభ పెడతానంటే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు విమర్శించారు. ప్రజాస్వామ్య దేశంలో ఎవరైనా, ఎక్కడైనా సభ పెట్టుకునే హక్కు ఉందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జనసేన సభకు ఎందుకు అనుమతి ఇవ్వలేదని ప్రశ్నించారు.
కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఉద్దేశపూర్వకంగానే మళ్లీ తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టాలని చూస్తున్నాయని ఆరోపించారు. ఈ రెండు పార్టీలను ప్రజలు పూర్తిగా తిరస్కరించే పరిస్థితి వచ్చిందని అన్నారు. అందుకే తమ ఉనికిని కాపాడుకోవడానికే మళ్లీ ప్రాంతీయ సెంటిమెంట్‌ను వాడుకుంటున్నాయని మండిపడ్డారు. గతంలో ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించిన ఎంఐఎంతో బీఆర్ఎస్ కలిసి పనిచేయలేదా? అని ఆయన నిలదీశారు. అది తెలంగాణ వ్యతిరేక శక్తులతో పనిచేసినట్లు అవ్వదా? అంటూ ప్రశ్నించారు. రాజకీయ పరిస్థితులను బట్టి తెలంగాణలో పొత్తుపై ముందుకెళ్తామని రామచందర్ రావు స్పష్టం చేశారు. జనసేనతో పొత్తుపై పార్టీ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించారు.

## రేవంత్ పర్యటన విహారయాత్ర లాంటిది

### : శ్రీనివాస్ గౌడ్



పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న తీరుపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ భవన్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతలు పాదయాత్రకు సిద్ధమైనప్పుడే ప్రభుత్వానికి ప్రాజెక్టుల తనిఖీలు గుర్తొస్తున్నాయని, ఇందులో వారి చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతోందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలోనే ఈ ప్రాజెక్టుల పనులు 80 నుంచి 90 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం చేస్తోందని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి పర్యటన కేవలం పబ్లిసిటీ కోసం చేసిన 'హెలికాప్టర్ విహారయాత్ర' లాంటిదేనని విమర్శించారు. కొల్లాపూర్ ప్రాంతంలో హార్టికల్చర్, పాలిటెక్నిక్ కాలేజీల ఏర్పాటును పక్కనబెట్టారని, మామిడి రైతులకు న్యాయం చేయలేదని మండిపడ్డారు. అలాగే, బీఆర్ఎస్ నేత శ్రీధర్ రెడ్డి హత్య జరిగి రెండేళ్లవుతున్నా విచారణలో పురోగతి లేదని, సీఎం పర్యటనల వేళ ప్రతిపక్ష నేతలను అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి పిక్నిక్ తరహా పర్యటనలు ఆపి, పాలమూరు అసలు సమస్యలపై, 'రామన్నగుట్ట రిజర్వాయర్' ప్రాజెక్టుపై స్పష్టమైన సమీక్ష నిర్వహించాలని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
# హైదరాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
hyderabadestate.co.in

05 శుక్రవారం జూన్ 2026

## డిసెంబర్‌లోపు తొలి ఇంటిగ్రేటెడ్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం పూర్తి

### జీహెచ్ఎంసీ పరిధిలో ఆధునిక సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణం వేగవంతం





హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 4:-
రంగారెడ్డి జిల్లా, జీహెచ్ఎంసీ పరిధిలో నిర్మించనున్న 13 ఆధునిక ఇంటిగ్రేటెడ్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భాగంగా శేరిలింగంపల్లిగండిపేట్ ప్రాంతంలో తొలి ప్రాజెక్టు పనులు వేగంగా కొనసాగుతున్నాయి. గచ్చిబౌలిలో నిర్మాణంలో ఉన్న కార్యాలయ పనులను రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ ప్రాజెక్టులు ప్రభుత్వంపై అదనపు భారం లేకుండా పీపీపీ విధానంలో అమలు అవుతున్నాయని, నిర్మాణం పూర్తైన తర్వాత ఐదేళ్లపాటు నిర్వహణ బాధ్యతలను నిర్మాణ సంస్థలే చేపడతాయని తెలిపారు. ప్రారంభంలో 45 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రతిపాదించిన భవనాన్ని ప్రస్తుతం 75 వేల చదరపు అడుగులకు విస్తరించారు.ప్రజలకు కార్పొరేట్ స్థాయి సేవలు అందించేందుకు విశాలమైన వేచివుండే హాళ్లు, ఆధునిక సాంకేతిక సదుపాయాలు, మహిళలు, వృద్ధులు, చిన్నారులకు అనుకూల ఏర్పాట్లు కల్పిస్తున్నారు. ప్రస్తుతం నాలుగు ప్రాజెక్టుల పనులు కొనసాగుతుండగా, జూన్ 6న కోహెడలో ఐదవ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు. ప్రాజెక్టు వ్యయం రూ.2122 కోట్ల నుంచి రూ.30 కోట్లకు పెరిగినప్పటికీ నాణ్యతలో రాజీ పడబోమని స్పష్టం చేశారు. నిర్మాణంలో స్వల్ప ఆలస్యం జరిగినా ఈ ఏడాది డిసెంబర్‌లోపు పనులు పూర్తి చేసి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు, సాంకేతిక నిపుణులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వార్డు సమావేశాల్లో ప్రజా సమస్యలపై దృష్టి..
## అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృత చర్చ
## ప్రజల భాగస్వామ్యంతో ముందుకు మున్సిపాలిటీ..
## వార్డు వారీగా అవగాహన సదస్సులు



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 4:-
ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కమిషనర్ వై. సుదర్శన్ పరిధిలోని 1, 5, 6, 14, 19, 24 వార్డుల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించబడ్డాయి. ఈ సమావేశాలకు మున్సిపల్ అధికారులు, వార్డు ప్రజాప్రతినిధులు, సిబ్బంది మరియు స్థానిక ప్రజలు హాజరయ్యారు. సమావేశాల్లో పట్టణ పరిశుభ్రతకు సంబంధించిన తాజా మార్గదర్శకాలు, గృహ వ్యర్థాలను వర్గీకరించి అందజేయాల్సిన విధానం, వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తాగునీటి పంపిణీ, కాలువల నిర్వహణ, ఓటరు మరియు పౌర సమాచారం నమోదు కార్యక్రమాలు, వర్షపు నీటి నిల్వ పద్ధతులు, హరితాభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు వివరాలు అందించారు. అలాగే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, స్థానిక అవసరాలు మరియు అభివృద్ధికి సంబంధించిన సూచనలను అధికారులు స్వీకరించారు. వాటిపై వెంటనే స్పందించి, పరిష్కార చర్యలు చేపట్టేందుకు సంబంధిత శాఖల సిబ్బందికి సూచనలు జారీ చేశారు. ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు, వివిధ వర్గాల ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొనడంతో వార్డు సమావేశాలు ఫలప్రదంగా సాగాయి. ప్రజల అభిప్రాయాలను పాలనలో భాగం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## ప్రసూతి సేవల నాణ్యత పెంపుపై ప్రైవేట్ వైద్య సంస్థలకు ప్రత్యేక అవగాహన

### మాతాశిశు సంరక్షణ, ఆరోగ్య నిబంధనల అమలుపై వైద్య సిబ్బందికి మార్గనిర్దేశం







హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 4:-
రంగారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రైవేట్ వైద్య సంస్థల ప్రతినిధులకు ప్రత్యేక శిక్షణ
రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయ సమావేశ మందిరంలో ప్రైవేట్ వైద్య సంస్థల నిర్వాహకులు, వైద్యులు మరియు సిబ్బంది కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. స్వర్ణకుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలు, బాలింతలు మరియు నవజాత శిశువులకు అందించాల్సిన వైద్య సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడం, ప్రసూతి సేవల నిర్వహణలో పాటించాల్సిన ప్రమాణాలు, ఆరోగ్య సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా వివరించారు. అలాగే వ్యాధుల పర్యవేక్షణ వ్యవస్థ, సమగ్ర ఆరోగ్య సమాచార వేదిక, గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ నిషేధ చట్టం, వైద్య సంస్థల నిర్వహణకు సంబంధించిన చట్టబద్ధ నిబంధనలు, వాటి అమలు విధానాలపై సవివరంగా అవగాహన కల్పించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను ప్రతి వైద్య సంస్థ కచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ శిక్షణలో మాతా-శిశు ఆరోగ్య విభాగం కార్యక్రమ అధికారి డాక్టర్ రాధిక, జిల్లా టీకాల కార్యక్రమ అధికారి డాక్టర్ షీబా, డాక్టర్ శ్రీనివాస్ పాల్గొని వివిధ అంశాలపై సూచనలు అందించారు. జిల్లాలోని ప్రైవేట్ వైద్య సంస్థల ప్రతినిధులు, వైద్య నిపుణులు మరియు సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ నిబంధనల అమలులో పూర్తి సహకారం అందిస్తామని వారు తెలిపారు.

## రెడ్డి ఉమెన్స్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం



హైదరాబాద్, జూన్ 04: రాజా బహదూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్. డాక్టర్ జె. అచ్యుతదేవి తెలిపారు. గురువారం నారాయణగూడ లోని కళాశాలలో ఆమె మీడియాతో మాట్లాడుతూ... 73 ఏళ్లుగా మహిళా సాధికారతకు మారుపేరుగా నిలిచిన కళాశాల నాక్ 5వ సైకిల్లో 'ఏ' గ్రేడ్ సాధించి రాష్ట్రంలోనే మొదటి కళాశాలగా ఆర్ బీవిఆర్ఆర్ కళాశాల గుర్తింపు పొందిందని తెలిపారు. లైఫ్ సైన్స్, కామర్స్, ఆర్ట్స్, ఫిజికల్ సైన్సెస్ విభాగాలలో 18 అండర్ గ్రాడ్యుయేట్ (యుజి) కోర్సులను అందిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల కొత్తగా బీఎస్సీ ఇన్ న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్ కోర్సును ప్రారంభించినట్లు ఆమె పేర్కొన్నారు. కళాశాలలో వీ-హబ్, టి-హబ్, టీజీఏఐసీ లతో భాగస్వామ్యం కుదుర్చుకుని విద్యార్థులలో ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక ప్లేస్మెంట్ సెల్ ద్వారా ప్లేస్మెంట్ డ్రైవ్ లు, శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తూవిద్యార్థుల ఉపాధి నైపుణ్యాలను పొందిస్తున్నట్లు పేర్కొన్నారు. తద్వారా గ్రాడ్యుయేట్లైన విద్యార్థినీలకు ఉన్నతమైన కేరీర్ అవకాశాలను కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థినీలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

## ఉచితంగా వేద విద్య...



హైదరాబాద్, జూన్ 04: శ్రీశ్రీశ్రీ వైష్ణవి దేవి వేద విద్యా పీఠం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వేద విద్యను ఉచితంగా అభ్యసింపబడునని జాతీయ జ్యోతిష్య రత్న పురస్కార గ్రహిత, జ్ఞాన ప్రబోధానంద సరస్వతి దైవజ్ఞాలు, బ్రహ్మశ్రీ సురోజు ఉపేంద్ర ఆచార్యులు అన్నారు. గురువారం కాచిగూడలో విలేకరులతో ఉపేంద్ర దీక్షితులు మాట్లాడుతూ.. 12 సంవత్సరాల నుండి 25 సంవత్సల విశ్వబ్రహ్మణ యువతి, యువకులకు ఈ వేద విద్యను ఉచితంగా నేర్పించబడునని వెల్లడించారు. గత 25 యేండ్లుగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పురోహితం, జ్యోతిష్య సేవలను అందించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల యువత వివరాలకు సెల్ : 7396235319, 8301320859లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రజల భాగస్వామ్యంతో వార్డు అభివృద్ధికి కార్యాచరణ వైస్ చైర్మన్ శ్యామల భాస్కర్





హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 4:-
ఇబ్రహీంపట్నం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ 1వ వార్డులో ప్రత్యేక ప్రజా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మున్సిపల్ వైస్ చైర్మన్ ముత్యాల శ్యామల భాస్కర్ అధ్యక్షత వహించి స్థానికులతో ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా కాలనీ అభివృద్ధి అవసరాలు, పారిశుద్ధ్య నిర్వహణ, ఆహార భద్రత కార్డుల జారీ, సామాజిక భద్రత పథకాల అమలు, తాగునీటి సౌకర్యాలు, వర్షాకాలంలో తలెత్తే ఇబ్బందులు, మురుగు కాలువల సంరక్షణ వంటి పలు అంశాలపై ప్రజల అభిప్రాయాలను సేకరించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి కుటుంబం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచిస్తూ, ఇంటి వ్యర్థాలను తడిపొడి రూపంలో వేరు చేసి సిబ్బందికి అప్పగిస్తే పరిశుభ్రమైన నివాస ప్రాంతాల నిర్మాణానికి దోహదపడుతుందని వివరించారు. స్థానికులు ప్రస్తావించిన సమస్యలు, అవసరాలు మరియు సూచనలను నమోదు చేసుకుని వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. అదేవిధంగా వార్డు భవిష్యత్ అభివృద్ధికి రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను ప్రజలకు వివరించి, సమిష్టి సహకారంతో అభివృద్ధి లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పాల్గొన్న స్థానికులు తమ అభిప్రాయాలను వెల్లడిస్తూ అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతు తెలిపారు.

## మా వార్డులో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరిన బస్తివాసులు



హైదరాబాద్ ఎస్టేట్ 04జూన్
మంచిర్యాల జిల్లా మందమర్రి మున్సిపాలిటీలోని ఐదో వార్డు సుభాష్ నగర్ లో ప్రజా పాలన సందర్భంగా వార్డులో ఉన్న సమస్యలను పరిష్కరించాలని సిపిఐ, కాంగ్రెస్, బస్తివాసుల ఆధ్వర్యంలో సానిటరీ ఇన్స్పెక్టర్ వసంత్ కి వినిస్పత్రం ఇవ్వడం జరిగింది. సుభాష్ నగర్ మరియు ఆర్కే 1 మార్కెట్ లో ప్రతిరోజు మిషన్ భగీరథ వాటర్ మూడు నాలుగు రోజుల కూ ఒక్కసారి సప్లై చేస్తున్నారు, మిషన్ భగీరథ వాటర్ ప్రతిరోజు వచ్చే లాగున చూడాలని, సిసి రోడ్డు నూతనంగా నిర్మించాలి, శానిటేషన్ చేయాలి, చెత్త ట్రాలీ ప్రతిరోజు రావాలిని, పిచ్చి మొక్కలను తొలగించాలి, పాత కరెంటు పోల్స్ ను తీసివేసి కొత్త పోల్స్ ఏర్పాటు చేయాలని, కోతుల వలన ప్రజలు ఇబ్బంది పడుతున్నారు ఒంట్టరీగా వెళ్తే వారి మీద దాడి చేస్తున్నాయి, వెంటనే (కోతులు లను) వాటిని నివారించాలని, వీదీ దీపాలు లేని చోట విధి దీపాలు ఏర్పాటు చేయాలని, బోర్ వెల్స్ రిపేర్ చేయాలని బస్తివాసులు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ డిహెచ్పిఎస్ జిల్లా అధ్యక్షులు మామిడి గోపి సిపిఐ యువజన నాయకులు వంశీకృష్ణ, సంజయ్, కళ్యాణ్ రామ్, చెర్రీ, కాంగ్రెస్ నాయకులు మాంతు రవి, ఆల్కపున్నం మరియు ఆర్పీ కావ్య బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు రిజిస్ట్రీ నమోదు తప్పనిసరి అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి






హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 4:-

రంగారెడ్డి జిల్లా, మొయినాబాద్:
మొయినాబాద్ మండలంలోని గ్రామసభ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి పాల్గొని రైతు రిజిస్ట్రీ, ఫార్మర్ ఐడీ నమోదుపై రైతులకు అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, సబ్సిడీలు, పెట్టుబడి సహాయం వంటి ప్రయోజనాలు సకాలంలో పొందాలంటే రైతు రిజిస్ట్రీలో నమోదు తప్పనిసరి అని తెలిపారు. ఒక గుంట భూమి ఉన్న రైతు కూడా నమోదు చేసుకుని ఫార్మర్ ఐడీ పొందాలని సూచించారు. ఇంకా నమోదు చేయించుకోని రైతులను గుర్తించి ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (SIR-2026) కార్యక్రమాన్ని సమీక్షించి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేయాలని, వ్యవసాయ శాఖ అధికారుల సలహాలతో పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి కిషన్‌రావు, తహసీల్దార్, ఎంపీడీవో, వ్యవసాయ అధికారి అనూరాధ, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
05 శుక్రవారం జూన్ 2026

# జీలుగు విత్తనాలు పై సబ్సిడీ

హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల( ప్రతినిధి )

తెలంగాణ ప్రభుత్వం వానాకాలం 2026 లో రైతులు పచ్చి రొట్ట ఎరువులు సాగు చేయు నిమిత్తమై, పచ్చి రొట్ట ఎరువుల ఐన జీలుగ విత్తనాలు 50 శాతం సబ్సిడీపై ఇవ్వటం జరుగుతుంది. మద్దిరాల మండలంలో 81 బాగ్స్ (30 ఎస్త్ర) జీలుగ విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి అని మండల వ్యవసాయ అధికారి అనిషారుహి తెలిపారు ప్రస్తుతం 30 కిలోల జీలుగ విత్తనాల బ్యాగ్ ధర రైతు వాటాగా రూ. 2,452/- మాత్రమే. ఒక 30 కిలోల బ్యాగ్ సుమారు 2-2.5 ఎకరాల విస్తీర్ణానికి సరిపోతుంది. పచ్చిరొట్టె ఎరువుగా జీలుగ సాగు చేయడం వల్ల నేలలో సేంద్రియ పదార్థం పెరుగుతుంది, రసాయన ఎరువుల వాడకం తగ్గి ఖర్చు తగ్గుతుంది, పంట దిగుబడి పెరుగుతుంది, మట్టిలో సూక్ష్మ జీవాల సంఖ్య పెరిగి నేల ఆరోగ్యం మెరుగు అవుతుంది, భూమి గట్టిదనం తగ్గి మెత్త పడుతుంది, నేలలో నైట్రోజన్ స్థాయి పెరగటం మొదలగు చాల ప్రయోజనాలు ఉంటాయి జీలుగ బస్తాలు కావాల్సిన రైతులు తేదీ 05.06.2026 నుండి పట్టా పాస్ బుక్ మరియు ఆధార్ కార్డు జెరాక్స్ తీసుకొని రైతు వేదిక,మద్దిరాల నందు సంప్రదించగలరు. ఈ విత్తనాలు నాగార్జున డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ, మద్దిరాల నందు అందుబాటులో ఉన్నాయి..

## కోకాపేటలోని దొడ్డి కొమురయ్య ఆత్మగౌరవ భవనం ఎవ్వరికీ లీజ్ కు ఇవ్వలేదు

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఐలయ్య కురుమ



హైదరాబాద్, జూన్ 04: గత కొంత కాలంగా దుష్టశక్తులు, సంఘం వ్యతిరేక శక్తులు, అజ్ఞానులు కొంత మంది తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘంపై బడా నేతలపై సోషల్ మీడియాలో చేస్తున్న ఆరోపణలు, విమర్శలను ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కురుమ తిప్పికొట్టారు. ఈ సందర్భంగా గురువారం కోకాపేటలోని ప్రతిష్టాత్మకంగా నిర్మించిన తెలంగాణ రాష్ట్ర కురుమ విద్యార్థుల హాస్టల్ ట్రస్ట్ భవన్, దొడ్డి కొమురయ్య కురుమ ఆత్మగౌరవ భవనం ప్రాంగణంలో ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కురుమ ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి కొంత మంది చేస్తున్న తప్పుడు ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. అలాగే కురుమల ఆరాధ దైర్యం శ్రీ శ్రీ శ్రీ బీరప్ప స్వామి సాక్షిగా ఈ భవనం ఎవ్వరికీ ఎలాంటి లీజుకు ఇవ్వలేదని ఆయన వివరణ ఇచ్చారు. తాను ఎమ్మెల్యేగా గెలుపొందేందుకు రాష్ట్ర కురుమలు సహకరించారని, కింది స్థాయి నుంచి ఎమ్మెల్యేగా ఎదిగానని పలు ఆసక్తికర విషయాలు చెప్పుకొచ్చారు. కాని తనపై సంఘం పెద్దలపై ఆరోపణలు, విమర్శలు చేయడం తగదని, ఇక నుంచి అవి మానుకుని సంఘానికి, కురుమలకు సేవలు అందించాలని ప్రభుత్వ విప్ ఐలయ్య సూచించారు. ఎంతో ఆసక్తికరంగా జలిగిన ఈ ప్రెస్ మీట్ లో తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ క్యామ మల్లేశం కురుమ, కురుమ రాష్ట్ర నాయకులు కొలుపుల నరసింహ, జాతీయ బీసీ యువజన సంఘం అధ్యక్షుడు కంకాల శ్యామ్ కురుమ, రాష్ట్ర బీసీ సంఘం నేత గొరిగే కృష్ణ కురుమ, షెపర్డ్ ఇంటర్నేషనల్ సంస్థ తెలంగాణా రాష్ట్ర శాఖ అధ్యక్షుడు బూర్గడ్డ నగేష్ కురుమ, కోశికె శ్రీనివాస్ రావు కురుమ, ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థుల సంఘం నేత డాక్టర్ కె.ఎలెందర్, మణికొండ కార్పొరేటర్ ముత్యాలు, చల్లాపూర్ కార్పొరేటర్ శ్రీశైలం, కార్పొరేటర్ కె పోచన్న, ఆలేరు మున్సిపల్ చైర్ పర్సన్ బి. భాస్కర్, ఎన్. మల్లేష్, మణికొండ కురుమ సంఘం మండల అధ్యక్షులు డి భాస్కర్, కే. కుమార్, తదితర ప్రముఖులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బాల్యం అంత అక్కడే మళ్లీ

## 15 ఏళ్ల తర్వాత బాల్య మిత్రులు



హైదరాబాద్ ఎస్టేట్ మహేశ్వరం ప్రతినిధి కృష్ణ చారి జూన్ 4 ఇబ్రహీంపట్నం APSWREIS రెసిడెన్షియల్ పాఠశాలలో 2010-11లో చదివిన పూర్వ విద్యార్థులు 15 ఏళ్ల అనంతరం ఆప్యాయంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన స్నేహ సమ్మేళనంలో పూర్వ జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. విద్యార్థి దశలో తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రావిచెట్టి శ్రీనివాస్, సందీప్ , ఆనంద్ ,అరుట్ల శివ, రామకృష్ణ, కిషోర్, సంపత్, శ్రమిక్, రమాకాంత్, భానుచందర్, నోముల శివ, అశోక్ గౌడ్, ఆంజనేయులు, ప్రదీప్ ,షాబాద్ శివ, కరుణాకర్, మధుకర్, ప్రవీణ్, వికాస్, సంజీవ్ లాల్, కె రాజు , మద్దెల శ్రీకాంత్ పాల్గొన్నారు.

## నందు పల్లి గ్రామంలో "ఏక్ పెడ్ మాకే నామ్" కార్యక్రమంలో సర్పంచ్ దేశపాగ నరసింహ



( హైదరాబాద్ ఎస్టేట్ మహేశ్వరం ప్రతినిధి కృష్ణ చారి జూన్ 04:)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని అంతుపల్లి గ్రామంలో.. (ఏక్ పెడ్ మాకే నామ్) అనే కార్యక్రమంలో భాగంగా.. అమ్మ పేరిట మొక్కలు నాటడం జరిగింది అనంతరం గ్రామంలో.. పరిశుభ్రతపై అవగాహన తెలుపుతూ తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా ఉండాలని తెలియపరిచారు ఈ యొక్క కార్యక్రమం..ఈ కార్యక్రమం సందర్భంగా సర్పంచ్ దేశపాగ నర్సింహా, ఉప సర్పంచ్ షేక్ ఎజాస్, వార్డు మెంబెర్ రంగుల యాదమ్మ, కల్వకోల్ మహేందర్, ఎంపీపీస్ పి . నిరంజన్ సార్, అంగన్వాడీ టీచర్ కే . కవిత, రంగుల రవీ, షమీమ్, కొమ్మ రవి, కర్రే అంజయ్య, దేశపాగ పోచయ్య, అందరూ కలిసి చెట్లు నాటి "ఎక్ పెడ్ మాకే నామ్ " అనే కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# కర్ణంగూడను జిల్లాకే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి

## : కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

### గ్రామంలో స్కూల్ ని ఓపెన్ చేయండి మీ సమస్యలను నేను చూసుకుంటా కలెక్టర్

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 4:-

ఇబ్రహీంపట్నం: ప్రజాపాలనప్రగతి ప్రణాళికలో భాగంగా కర్ణంగూడ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి పాల్గొని గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని, పంటల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ఈ ఏడాది వర్షాలు ఆలస్యమయ్యే అవకాశం ఉన్నందున వ్యవసాయ శాఖ సూచనల మేరకు పంటల ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించారు. గ్రామంలో పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి ఇంట్లో తడి చెత్తపొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని తెలిపారు. చెత్త నిర్వహణలో కర్ణంగూడను జిల్లాకు ఆదర్శ గ్రామంగా నిలపాలని పిలుపునిచ్చారు. వర్షాకాలం ప్రారంభం



కాగానే పెద్ద ఎత్తున మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. మూతపడిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తిరిగి ప్రారంభించేందుకు గ్రామస్థులు సహకరించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంటాయని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా ప్రత్యేక ఓటరు జాబితా పునర్విమర్శ కార్యక్రమంలో ప్రతి అర్హుడి పేరు నమోదు అయ్యేలా ప్రజలు సహకరించాలని కోరారు. డీసీపీ నారాయణ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, తాగి వాహనం నడపడం, ట్రిపుల్ రైడింగ్ వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ గ్రామసభలో పోలీస్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ సర్పంచ్ తిరుమల్ రెడ్డి, ఉప సర్పంచ్ యంపల్ల రవీందర్ రెడ్డి , వార్డు సభ్యులు మహిపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాజు గౌడ్ , కీర్తి, ధనలక్ష్మి, సంధ్య, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళలు, గ్రామస్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కూటమి రాజకీయాలు వేడెక్కాయి

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికలకు బీజేపీకి ఆర్పీఐ(ఏ) మద్దతు

హైదరాబాద్, జూన్ 04:

తెలంగాణలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ)తో పొత్తు పెట్టుకుని సంయుక్తంగా పోటీ చేసేందుకు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే) ప్రణాళికలతో ముందుకు వెళ్తోందని కేంద్ర సాంఘిక న్యాయ, సాధికారత శాఖ సహాయ మంత్రి, ఆర్పీఐ(ఏ) జాతీయ అధ్యక్షుడు రామ్‌దాస్ అథవాలే తెలిపారు. కర్ణాటకలోని గుల్బర్గాలో జరిగిన పార్టీ కీలక నాయకుల సమావేశంలో అథవాలే మాట్లాడుతూ.. తెలంగాణ వ్యాప్తంగా జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్డీఏ) ని బలోపేతం చేయాలని, క్షేత్రస్థాయిలో దాని ప్రభావాన్ని విస్తరించాలని నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా, ఆర్పీఐ(ఏ) జాతీయ కార్యదర్శి పేరం శివ నాగేశ్వరరావు గౌడ్, కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథవాలేతో సమావేశమై తెలంగాణ రాజకీయ పరిస్థితి, స్థానిక సంస్థల ఎన్నికలు, రాష్ట్రంలో ఎన్డీఏ ఉనికిని విస్తరించే అవకాశాలపై కూలంకషంగా చర్చించారు. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, తెలంగాణ వ్యాప్తంగా గ్రామ స్థాయి నుండి పట్టణ కేంద్రాల వరకు ఎన్డీఏ కూటమిని బలోపేతం చేయాల్సిన ఆవశ్యకతను అథవాలే నొక్కి చెప్పారు. ప్రజా సమస్యలను సమిష్టిగా పరిష్కరించి, రాష్ట్రంలో ఒక బలమైన ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదగాలని ఆయన పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.దళితులు, వెనుకబడిన తరగతులు (బీసీలు), ఇతర అణగారిన వర్గాల సంక్షేమానికి, సాధికారతకు ఆర్పీఐ(ఏ) కట్టుబడి ఉందని అథవాలే పునరుద్ఘాటించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడం, సామాజిక న్యాయ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం కోసం పనిచేస్తూనే, తమ పార్టీ బీజేపీతో సమన్వయం కొనసాగిస్తుందని ఆయన తెలిపారు.రాబోయే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, తెలంగాణ వ్యాప్తంగా ఆర్పీఐ(ఏ) సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయాలని కేంద్ర మంత్రి పార్టీ నాయకులకు సూచించారు.

ఈ సమావేశానికి టి. రాజ్‌కుమార్ తో పాటు కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఎన్డీఏ కూటమిని బలోపేతం చేయడం, పార్టీ సభ్యత్వాన్ని విస్తరించడం, ప్రజా ఉద్యమాలను నిర్వహించడం, స్థానిక సంస్థల ఎన్నికలకు వ్యూహాలను రూపొందించడం వంటి అంశాలపై చర్చలు జరిగాయి.



రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పార్టీ ఉనికిని విస్తరించేందుకు ఒక ప్రత్యేక సంస్థాగత కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆర్పీఐ(ఏ) తెలంగాణ విభాగం ప్రకటించింది. మున్సిపల్ ఎన్నికల కోసం బీజేపీతో ఎన్నికల సమన్వయంపై త్వరలో అధికారిక చర్చలు జరిగే అవకాశం ఉందని పార్టీ నాయకులు తెలిపారు. తెలంగాణలో మారుతున్న రాజకీయ వాతావరణంలో ఎన్డీఏ కూటమి ప్రభావాన్ని పెంచే దిశగా గుల్బర్గా సమావేశం ఒక కీలక ముందడుగు కాగలదని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

## ప్రజా సమస్యలపై గ్రామ సభలో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కు

## వినతి పత్రం ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు

( హైదరాబాద్ స్టేట్ మహేశ్వరం ప్రతినిధి కృష్ణ చారి జూన్ 04:)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మహేశ్వరం గ్రామపంచాయతీ ప్రాంగణంలో నిర్వహించిన గ్రామసభలో పలు సమస్యలపై వినతి పత్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ అధ్యక్షులు బంగారుగల్ల లాజర్, మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ బాబా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వత్తుల రఘుపతి, శివగంగ ఆలయ కమిటీ చైర్మన్ అల్లే కుమార్, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అల్లే బిక్షపతి, మహేశ్వరం గ్రామపంచాయతీ 1 వ వార్డు సభ్యులు టి. బేబీ మక్కాజి,మహేశ్వరం మాజీ ఉప సర్పంచ్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు కర్రెల రాములు ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం మండల సీనియర్ నాయకులు 11 వ వార్డ్ ఇన్చార్జ్ గదగూటి జంగయ్య ముదిరాజ్,కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ సమన్వయకర్త ఇందిరమ్మ కమిటీ సభ్యులు స్వర్ణగంటి సుభాష్, తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి మహేశ్వరం గ్రామ 2 వ వార్డు ఇంచార్జ్ గదగుటి మహేందర్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా మాజీ మండల అధ్యక్షుడు ఏపూరి నరసింహ, యూత్ కాంగ్రెస్ గ్రామ



శాఖ అధ్యక్షులు స్వర్ణ గంటి ఆకాష్, గ్రామ శాఖ ప్రచార కార్యదర్శి పినమోని శ్రీకాంత్ ముదిరాజ్,14 వ వార్డు ఇంచార్జ్ పుట్లగారి చందు, సీనియర్ నాయకులు సయ్యద్ భాషారత్ అలీ, దుంపల ప్రకాష్,తదితరులు కార్యక్రమంలో పాల్గొని వినతిపత్రం అందజేశారు,

# పెంచిన, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను రద్దు చేయాలి.

## జూన్ 9న రాస్తారోకోలను జయప్రదం చేయండి. –వామపక్ష పార్టీలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోలు, డీజిల్ పై వేస్తున్న పన్నులను రద్దు చేయాలని గురువారం సిపిఎం జిల్లా కార్యాలయంలో జరిగిన వామపక్ష పార్టీల సమావేశం డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి. కోటేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి రాజాన దొరబాబు పాల్గొని మాట్లాడుతూ ఇరాన్ పై ఇజ్రాయిల్, అమెరికా దాడుల నెపంతో దేశంలో ఎన్నడూ లేని విధంగా ఇంధన ధరలను పెంచేశారన్నారు. గత నెల 15 నుండి పెట్రోల్, డీజిల్, సిఎన్ జి గ్యాస్ పై రూ.8, వంట గ్యాస్ పై రూ.60, వాణిజ్య సిలిండర్ పై రూ.1500 పెంచి ప్రజల నడ్డి విరిచారన్నారు. పెట్రోల్, డీజిల్ పై వేస్తున్న పన్నులను రద్దు చేయాలని, భారీగా పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కాకినాడలో కేజీ బేసిన్ నుండి లభ్యమవుతున్న క్రూడాయిల్ నాచురల్ గ్యాస్ లో 12వ ఆర్థిక సంఘం సిఫార్సుకు అనుగుణంగా రాష్ట్రానికి 50 శాతం వాటాను కేటాయించాలన్నారు. యుద్ధం పేరుతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజలపై వేస్తున్న ఆర్థిక భారాలను ఎండగడుతూ, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఈ నెల 9న జరిగే రాస్తారోకో కార్యక్రమాల్లో ప్రజలందరూ పాల్గొవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్ శంకరరావు, గంటా శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యులు ఆర్ రాము, వివి శ్రీనివాసరావు, సిపిఐ జిల్లా నాయకులు రెడ్డిపల్లి అప్పలరాజు, సత్యనారాయణ, పప్పల ఈశ్వరరావు, సిపిఎం



సీనియర్ నాయకులు గండి నాయన బాబు, కె.ఈశ్వరరావు, కె.తెల్లయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
05 శుక్రవారం జూన్ 2026

# "ఏక్ పెడ్ మాకే నామ్" కార్యక్రమంలో పాల్గొన్న మహేశ్వరం సర్పంచ్ ల సంఘం ప్రధాన కార్యదర్శి బండారి లింగం ముదిరాజ్

### అమ్మ పేరిట ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటిన సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి బండారి లింగం ముదిరాజ్

### జూన్ 1 నుండి 5 వరకు స్వచ్ఛ గ్రామం సురక్షిత్ జలవాయు కార్యక్రమం లో భాగంగా అమ్మ పేరిట మొక్క నాటిన సర్పంచ్ బండారి లింగం ముదిరాజ్

( హైదరాబాద్ ఎస్టేట్ మహేశ్వరం ప్రతినిధి కృష్ణ చారి జూన్ 04:) రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని పెద్దపులి నాగారం గ్రామంలో గ్రామ సర్పంచ్ మరియు మహేశ్వరం మండలం సర్పంచ్ ల సంఘం ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ... జూన్ 4న మిషన్ లైఫ్ నీటి సంరక్షణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిరోధం, విడుదల తగ్గింపు, కిచెన్ గార్డెన్లు వంటి అంశాలపై అవగాహన కార్యక్రమం, (ఏక్ పెట్ మా కె నాన్) అనే కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడం పరిశుభ్రత కార్యక్రమాలు మొదలు పెట్టడం జరిగింది అందులో భాగంగా సర్పంచ్ బండారి లింగం ముదిరాజ్ అమ్మ పేరిట ప్రైమరీ స్కూల్లో ఒక మొక్క నాటడం జరిగింది ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడే విధంగా ఖాళీగా ఉన్న ప్రదేశాలలో గ్రామంలో మొత్తం మొక్కలు నాటే ప్రయత్నం చేయాలన్నారు అంతేకాకుండా గ్రామస్తులతో ఇంటింటికి వెళ్లి తడి చెత్త పొడి చెత్త విడివిడిగా ఉంచాలని తెలియజేస్తూ.. పర్యావరణం బాగుంటేనే గ్రామం బాగుంటుందని గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్రాలు అభివృద్ధి చెందుతుందని అని అన్నారు.. గ్రామం పరిశుభ్రంగా ఉండాలంటే ప్రతి ఒక్కరు గ్రామంలో తడి చెత్త పొడి చెత్త వేరు వేరు చేసి ఉంచాలన్నారు వాటిని తీసుకెళ్లడానికి గ్రామ పంచాయతీ కార్మిక సిబ్బంది వచ్చి తీసుకెళ్తారని తెలియజేశారు ఈ యొక్క కార్యక్రమంలో.. గ్రామ సర్పంచ్ బండారి లింగంతో పాటు.. వార్డు సభ్యులు షాహబుద్దీన్ ఖాన్, నయీమ్ ఖాన్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు శ్రీశైలం, అంగన్వాడి టీచర్లు నాగమణి, మాధవి, పంచాయతీ కార్యదర్శి ఎస్ జానయ్య పంచాయతీ కార్మిక సిబ్బంది తదితరులు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది







# ప్రజా సమస్యల వినతులు స్వీకరిస్తున్న... రాంకీ




నియోజకవర్గంలోని ప్రజా సమస్యలను తన సమస్యగా పరిగణంలో తీసుకొని స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో అనకాపల్లి నియోజకవర్గ ప్రజల మరియు కూటమి కార్యకర్తలు నుండి వారి సమస్యలకు సంబంధించిన వినతి పత్రాలను జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ భీమర శెట్టి రాంకీ స్వీకరించారు. సమస్యలను విన్న అనకాపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ భీమరశెట్టి రాంకీ వారి సమస్యలపై సానుకూలంగా స్పందించి మాజీ మంత్రివర్యులు , శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ దృష్టికి తీసుకువెళ్లి అతి త్వరలోనే పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని ప్రజలకు మరియు కార్యకర్తలకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా, ప్రజల సమస్యల పరిష్కారానికి జనసేన పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలబడుతుందని ఆయన తెలియజేశారు.

# విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులతో భేటీ

### ఉత్తరాంధ్ర బి సి వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మత్తుర్తి గంగారావు




జిల్లాలోని సబ్బవరం మండలం విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పొన్నాడ రామకృష్ణ, కార్యదర్శి ముకుంద, కోశాధికారి ప్రసాద్‌తో పాటు కార్యవర్గ సభ్యులు ఉత్తరాంధ్ర బి సి వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మత్తుర్తి గంగారావును మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణుల సంక్షేమం, బీసీ వర్గాల సామాజిక–ఆర్థిక అభ్యున్నతి, విద్యా అవకాశాల విస్తరణ, ఉపాధి కల్పన, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు వంటి పలు అంశాలపై చర్చించారు. సమాజ అభివృద్ధికి పరస్పర సహకారంతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. భేటీ అనంతరం సంఘ ప్రతినిధులు గంగారావుకు శుభాకాంక్షలు తెలియజేసి, బీసీ మరియు విశ్వబ్రాహ్మణ సమాజాల అభ్యున్నతి కోసం భవిష్యత్తులోనూ కలిసి పనిచేయాలని ఆకాంక్షించారు.

# రెండేళ్ల పాలనలో సంక్షేమ అభివృద్ధి అద్భుతం


### – మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్





తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్సీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు విజయవాడలో వెలసిన శ్రీశ్రీశ్రీ కనకదుర్గమ్మవారిని జగన్ రెడ్డి విధ్వంసాక, అరాచక దోపిడి పాలన నుండి ఆంధ్ర ప్రదేశ్ ప్రజలకు విముక్తి కలిగిన జూన్ 4వ తేదీన కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధర్మ పాలనలో సుఖ సంతోషాలతో ఎటువంటి బూతులు, దౌర్జన్యాలు, దోపిడీలు విధ్వంసాలు లేని పాలనలో ఉన్నందున అమ్మవారికి మొక్కు తీర్చుకునే కార్యక్రమంలో అమ్మవారిని దర్శించుకున్న అనంతరం అర్చక స్వాములు నాగ జగదీశ్ ని వేదమంత్రోత్సవతో ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నాగ జగదీష్ మాట్లాడుతూ జూన్ 4, 2024 ఆంధ్రప్రదేశ్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే రోజు, విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రాన్ని నడిపించాలని ప్రజలు అపూర్వమైన తీర్పు ఇచ్చిన చారిత్రాత్మక దినానికి నేటికి రెండేళ్లు. ఆ విజయం మాకు అధికారం కాదు,రాష్ట్ర పునర్నిర్మాణానికి ప్రజలు అప్పగించిన మహోన్నత బాధ్యత,ఆ బాధ్యతను గౌరవిస్తూ ప్రతి క్షణం ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విద్య ఐటీ శాఖ మాత్యులు నారా లోకేష్ కృషి చేస్తున్నారని నాగ జగదీష్ అన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన లక్ష్యంగా రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులు, ఈ రెండు సంవత్సరాలు కాలంలో 6,28,347 ఉద్యోగాలు కల్పించారని, కార్మికులు సహా ప్రతి వర్గ సంక్షేమం కోసం పనిచేస్తున్నారని, అసమానతలు లేని సమాజం, అన్ని ప్రాంతాల అభివృద్ధి కూటమి లక్ష్యంగా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ రాష్ట్రాన్ని హెల్తీ, వెల్తీ, హ్యాపీగా చేయాలనేది ముఖ్యమంత్రి సంకల్పంమని, నాటి తీర్పును గౌరవించేలా, ప్రజలు గర్వపడేలా పాలన సాగిస్తున్నారని ప్రజలు మద్దతుగా నిలిచిన ప్రతీ ఒక్కరికీ నాగ జగదీష్ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెటింగ్ చైర్మన్ పూతి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

# గ్రామంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ఇంటింటికి వాటర్ కు అంతరాయం....







మండలంలోని అక్కిరెడ్డిపాలెం గ్రామపంచాయతీ తారకరామా కాలనీ లో జలజీవన్ మిషన్ పథకం ద్వారా కొత్త గా నిర్మించబడిన ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు సదరు కాంట్రాక్టర్ అలసత్వం కారణంగా ఇంటింటికి మంచినీరు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ విషయం తెలుసుకొని ప్రజల ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వారి అవసరాలను ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ తన తండ్రి పేరు మీద వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేసి నిరంతరం ప్రజా సేవకు ముందుండే స్థానిక మాజీ సర్పంచ్ మరియు ౹ా4 మార్గదర్శి అవార్డు గ్రహీత సాలాపు శాంతి సూరి అప్పారావు ఇంటింటికి వాటర్ ట్యాంకర్ ద్వారా ఏర్పాటు చేశారు. ఈ విషయంపై గ్రామస్తులు ఆయన్ని ప్రత్యేకంగా అభినందించారు.

# పరిశుద్ధ కార్మికుల పోస్టును భర్తీ చేయాలి....

### - సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏవి నాగేశ్వరరావు







జి.వి.ఎం.సి అనకాపల్లి జోన్ లో ఖాళీగా ఉన్న పారిశుద్ధ్య కార్మికుల పోస్టులను భర్తీ చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. వి. నాగేశ్వరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. అనకాపల్లి జివిఎంసి జోనల్ కార్యాలయం వద్ద రెండువ రోజు ఆంధోళన జరిగింది. ఈసందర్బంగా ఎ. వి. నాగేశ్వరావు మాట్లాడుతూ అనకాపల్లిల్లో మున్సిపలాల్టీ నుండి వారసత్వంగా కార్మిక కుటుంబాలుకు ఉపాధి కల్పించడం జరుగుతుందని దానిని జివిఎంసి ఆధికాలు అమలు చేయాలన్నారు. మున్సిపల్ కార్మిక కుటుంబాలుకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రస్తుతం కార్మికులపై పనిభారం తగ్గించాలని,కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని,పర్మినెంట్ కార్మికులకు పి.ఆర్సీ, డి.ఎ. సరండర్ లీవ్స్ తో పాటు పెండింగ్లో ఉన్న అన్ని సమస్యలను పరిష్కరించాలని, జోన్ లో 15 మంది కార్మికులుకు 8 నెలు నుండి వేతనాలు ఇవ్వక పోవడం దుర్మార్గం అన్నారు. వెంటనే వారికి వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేసారు. మున్సిపల్ పారిశుద్ధ్య లోడర్స్ కార్మికులకు 3 నెలలు బకాయి పడ్డ వేతనాలు వెంటనే ఇవ్వాలని కోరారు. మున్సిపల్ సేవలను ప్రయివేట్ కి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం జీఓ ఇవ్వడం చరికాదన్నారు. దీనివలన కార్మికులుకు ఉద్యోగ భద్రత లేకూండా పోతుందన్నారు. ప్రజలుపై కూడా భారాలు పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. శంకరరావు, జిల్లా ఉపాధ్యక్షులు గంటా శ్రీరామ్, మండల కన్వీనర్ కాళ్ళ తేలయ్యబాబు, వై. ఎసురాజు, పోలరావు, ఓంనమశివ, ఎన్. అజయ్, ఎస్, నూకరాజు, ఎస్, బారతి, దేవి, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు "స్టాప్ ఫేస్ వాష్ & గో"










జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా రాత్రి గస్తీ విధులను మరింత పటిష్టంగా నిర్వహిస్తూ, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో పరవాడ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న వాహనదారులకు అవగాహన కల్పిస్తూ "స్టాప్ ఫేస్ వాష్ & గో" కార్యక్రమం నిర్వహించారు. రాత్రి వేళల్లో దీర్ఘదూర ప్రయాణాలు చేసే వాహనదారులు అలసట, నిద్రమత్తు కారణంగా ప్రమాదాలకు గురికాకుండా కొంతసేపు వాహనాలను నిలిపి విశ్రాంతి తీసుకోవాలని, ముఖం కడుక్కొని అప్రమత్తంగా ప్రయాణం కొనసాగించాలని సూచించారు. అలాగే జిల్లా నైట్ రౌండ్స్‌లో భాగంగా అనకాపల్లి ఫోర్ రోడ్స్ జంక్షన్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించి, ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా డ్రైవర్లు అలసటతో వాహనాలు నడపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజల ప్రాణ భద్రతే లక్ష్యంగా జిల్లా పోలీసు శాఖ ఇటువంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తోందని అధికారులు తెలిపారు.

# ఎంపీపై అబాండాలు వేస్తే ఖబర్దార్: బీజేపీ నేతలు

### – పంచదార్ల కొండ గ్రావెల్ తవ్వకాలపై చరిత్ర తెలుసుకొని మాట్లాడాలి: చిన్నారావు



ఎంపీ సీఎం రమేష్‌పై అబాండాలు వేస్తే ఖబర్దార్ అంటూ ఎలమంచిలి నియోజకవర్గ బీజేపీ నాయకులు హెచ్చరించారు. అచ్యుతాపురంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీజేపీ జిల్లా కార్యదర్శి, ఎలమంచిలి నియోజకవర్గ బీఎల్ఏ–1 ఇంచార్జ్ కొరుపోలు చిన్నారావు మాట్లాడారు. పంచదారల కొండపై గ్రావెల్ తవ్వకాలపై చరిత్ర తెలుసుకొని వైఎస్ఆర్‌సీపీ నాయకులు మాట్లాడాలని సూచించారు. కూటమి నాయకులపై ఆధారాలు లేకుండా కొన్ని పత్రికలు, ఛానళ్లలో వచ్చిన వార్తలను ఆయన ఖండించారు. ఆధారాలు లేని వార్తలు రాస్తే పరువు నష్టం దావా వేస్తామని, కూటమి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం మానుకోవాలని వైసీపీ నేతలకు హితవు పలికారు. గత వైసీపీ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్ తవ్వి పంచదారల కొండను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. దీనిపై మాట్లాడే ముందు కరణం ధర్మశ్రీ నిజాలు తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అచ్యుతాపురం మండల అధ్యక్షులు కూండ్రపు నాయుడు బాబు, జిల్లా బీజేపీ యువ మోర్చా ప్రధాన కార్యదర్శి లాలం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# పవన్ కల్యాణ్ భాష, తీరు సరిగా లేదు

## : గుత్తా సుఖేందర్ రెడ్డి



తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ కూటమి నాయకులకు, ముఖ్యంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు గట్టి కౌంటర్ ఇచ్చారు. మీడియా ప్రతినిధులతో జరిగిన చిట్‌చాట్‌లో ఆయన ఏపీ నాయకుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకలు జరుగుతున్న ఈ కీలక సమయంలో.. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇక్కడ సభలు నిర్వహిస్తామనడం ఎంతమాత్రం సరైనది కాదని గుత్తా సుఖేందర్ రెడ్డి స్పష్టం చేశారు. అంతేకాకుండా, ఇటీవల జరిగిన మీడియా సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడిన భాష, ఆయన తీరు అస్సలు బాలేదని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిపై కూడా గుత్తా సుఖేందర్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "అమరావతి బ్రహ్మాండమైన రాజధాని అని చెబుతున్న ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, అక్కడి మంత్రులు ముందు అమరావతిలోనే నివాసం ఉండాలి" అని సూచించారు. తెలంగాణతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లోనే ఎక్కువ వనరులు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. ఏపీకి సుదీర్ఘమైన సముద్ర తీరంతో పాటు, రకరకాల పోర్టులు కూడా ఉన్నాయని... కాబట్టి ఆ నాయకులంతా వారి రాష్ట్ర అభివృద్ధిని చూసుకోవాలి తప్ప, తెలంగాణ వైపు చూడాల్సిన అవసరం లేదని హితవు పలికారు. ఇక్కడ ఎలాంటి విద్వేషాలు సృష్టించడానికి ప్రయత్నించవద్దని హెచ్చరించారు.తెలంగాణ వ్యవసాయ రంగం, ధాన్యం కొనుగోళ్లపై గుత్తా సుఖేందర్ రెడ్డి పలు వివరాలను పంచుకున్నారు. తెలంగాణలో ఇప్పటికే 75 శాతం ధాన్యం సేకరణ పూర్తయిందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లకు కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం సహకరించడం లేదని ఆరోపించారు. రైతులు సాంప్రదాయ పద్ధతుల్లోనే కాకుండా పంట మార్పిడి వైపు దృష్టి సారించాలని కోరారు. ప్రస్తుతం మన రైతులు వరి, పత్తి తప్ప వేరే ఇతర పంటలు పండించడం లేదని, దీనిపై మార్పు రావాలని ఆయన వివరించారు.

# భూముల విలువ పెంపు

## : రిజిస్ట్రేషన్ ఆఫీసులకు పోటెత్తిన జనం

తెలంగాణలో భూముల మార్కెట్ విలువలు, రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగనున్నాయనే వార్తల నేపథ్యంలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలు జనంతో కిటకిటలాడాయి. పాత ధరలకే రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకునేందుకు గురువారం ఉదయం నుంచే ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 4న రాత్రి 7:30 గంటల వరకు పనివేళలను పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న వాస్తవ ధరలకు, అధికారిక రిజిస్ట్రేషన్ విలువలకూ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించడం ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇది రేపటి నుంచి అమలులోకి వస్తుండటంతో, పెరిగే ఛార్జీల భారం నుంచి తప్పించుకునేందుకు కొనుగోలుదారులు కార్యాలయాల వద్ద బారులు తీరారు.ప్రజల రద్దీ, విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న రెవెన్యూ శాఖ, ప్రత్యేకంగా గురువారం పనివేళలను పొడిగించింది. టోకెన్లు తీసుకున్న వారందరి రిజిస్ట్రేషన్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. ప్రభుత్వం పనివేళలు పొడిగించి సౌలభ్యం కల్పించినా, భారీ సంఖ్యలో జనం రావడంతో వ్యవస్థపై ఒత్తిడి నెలకొంది.

# వైసీపీ సైకో విధానాల నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి కలిగిన రోజు ఇది


## : మంత్రి రాంప్రసాద్ రెడ్డి



ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ పాలన అంతమై, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి పునాది పడిన చారిత్రాత్మక తీర్పు వెలువడి నేటికి సరిగ్గా రెండేళ్లు పూర్తయిందని మంత్రి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడిన ఆయన.. జగన్ నేతృత్వంలోని అరాచక, విధ్వంసక పాలనకు ప్రజలు శాశ్వతంగా చరమగీతం పాడిన రోజు ఇదని అభివర్ణించారు.గత ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలు ఇచ్చిన చరిత్రాత్మక తీర్పు రాష్ట్ర చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలిచిపోతుందని మంత్రి తెలిపారు. "వైసీపీ సైకో విధానాల నుంచి రాష్ట్ర ప్రజలు పూర్తిగా విముక్తి పొందారు. రాష్ట్రాన్ని ఒక బందిపోటు దొంగల ముఠాలా నడిపిన తీరుకు ప్రజలు తమ ఓటు హక్కుతో గట్టి బుద్ధి చెప్పారు" అని అన్నారు. గత ఐదేళ్ల కాలంలో వ్యక్తిగత కక్షలు, వేధింపుల రాజకీయాల వల్ల ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లోనూ దారుణంగా వెనుకబడిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకే ప్రజలు కూటమికి అఖండ మద్దతు ఇచ్చి గెలిపించారని మంత్రి గుర్తుచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థవంతమైన నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ మళ్లీ పునర్ వైభవాన్ని సంపాదించుకుంటూ, శరవేగంగా అభివృద్ధి బాట పట్టిందని స్పష్టం చేశారు. అమరావతిని పునర్నిర్మించడం అనేది కూటమి ప్రభుత్వ దృఢ సంకల్పానికి, నిబద్ధతకు నిదర్శనమని మంత్రి వెల్లడించారు.ఈ రెండేళ్ల స్వల్ప కాలంలోనే కూటమి ప్రభుత్వం అటు అభివృద్ధి, ఇటు సంక్షేమ రంగాల్లో ఎంతో స్పష్టమైన మార్పును తీసుకువచ్చిందని రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ప్రజల ఆశలు, ఆశయాలకు అనుగుణంగానే తమ పాలన నిరంతరం కొనసాగుతుందని చెప్పారు. వైసీపీ విధ్వంసానికి ముగింపు పలికి, రాష్ట్రంలో ఒక కొత్త అభివృద్ధి యుగానికి నాంది పలికిన ఈ రోజు (జూన్ 4) ఏపీ ప్రజల గుండెల్లో ఎప్పటికీ మరపురాని రోజుగా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

# తెలంగాణలో పలు జిల్లాల్లో భారీ వర్షం..

## జనజీవనం అస్తవ్యస్తం



తెలంగాణలోని పలు జిల్లాలలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వాన కారణంగా అనేక చోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు పట్టణాలు, గ్రామాల్లో రహదారులపై వర్షపు నీరు ఉద్ధృతంగా ప్రవహించడంతో సాధారణ జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది.

జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్, కరీంనగర్ పట్టణం, హుజూరాబాద్, సిద్ధిపేట జిల్లాలోని హుస్నాబాద్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాలతో పాటు ములుగు జిల్లాలోని మల్లంపల్లి, వెంకటాపూర్, ములుగు మండలాల్లో వర్షం బీభత్సం సృష్టించింది. పలుచోట్ల రోడ్లు వాగులను తలపించడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి.

# ఆర్థిక శాఖను తన వద్దే ఉంచుకున్న సీఎం డీకే శివకుమార్..

## ప్రియాంక్ ఖర్గేకు హోం శాఖ!



కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు తర్వాత కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రుల శాఖల కేటాయింపు (గాశీతీటశీశ్రీఱశీ చాశ్రీశ్రీశీఞఱశీఱ) ప్రక్రియ పూర్తయింది. నూతన ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అత్యంత కీలకమైన ఆర్థిక శాఖను తన వద్దే ఉంచుకోగా, కాంగ్రెస్ అధిష్ఠానానికి అత్యంత నమ్మకస్తుడైన సీనియర్ నేత ప్రియాంక్ ఖర్గేకు హోం మంత్రిత్వ శాఖ బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ ఆమోదించిన అధికారిక జాబితా గురువారం (జూన్ 4) రాత్రి విడుదలైంది.కొత్త కేబినెట్ కూర్పు ప్రకారం.. ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆర్థిక శాఖతో పాటు సిబ్బంది-పరిపాలనా సంస్కరణల శాఖ (ఞూా=), కేబినెట్ వ్యవహారాలు, ఇంటెలిజెన్స్ (అంతర్గత భద్రత), మరే ఇతర మంత్రికి కేటాయించని శాఖలను తన నియంత్రణలోనే ఉంచుకున్నారు. తద్వారా రాష్ట్ర ఆర్థిక, పరిపాలనా వ్యవస్థలపై ఆయన పట్టు సాధించారు. ఇక అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ూ×జజ) అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుమారుడైన ప్రియాంక్ ఖర్గేకు కీలకమైన హోం శాఖతో పాటు ఐటీ, బయోటెక్నాలజీ, ఈ-గవర్నెన్స్ బాధ్యతలను కట్టబెట్టారు. డిప్యూటీ సీఎం జి.పరమేశ్వరకు రెవెన్యూ, యువజన సేవలు, క్రీడల మంత్రిత్వ శాఖ దక్కింది.సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో కీలక శాఖలు నిర్వహించిన పలువురు సీనియర్ మంత్రులు ఈ కేబినెట్‌లోనూ తమ పాత పోర్ట్‌ఫోలియోలను నిలబెట్టుకున్నారు. ఎంబీ పాటిల్ (పరిశ్రమలు), కేహెచ్ మునియప్ప (పౌర సరఫరాలు), సతీష్ జార్కిహోళి (పబ్లిక్ వర్క్స్ - ూఔణ), డాక్టర్ శరణ్ ప్రకాష్ పాటిల్ (వైద్య విద్య)లు యథాతథంగా కొనసాగుతున్నారు. కాగా, గతంలో డీకే శివకుమార్ నిర్వహించిన బెంగుళూరు నగరాభివృద్ధి శాఖను ఈసారి కృష్ణా బైరేగౌడకు అప్పగించారు. మాజీ సీఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర సిద్ధరామయ్యకు పట్టణాభివృద్ధి శాఖ లభించింది.అయితే, బెంగళూరు అభివృద్ధి వంటి కీలక శాఖల కోసం మంత్రుల మధ్య తీవ్రస్థాయిలో లాబీయింగ్ జరగడం, సీనియర్ నేత రామలింగారెడ్డి వంటి వారు అసంతృప్తి వ్యక్తం చేయడంతో శాఖల ప్రకటన కాస్త ఆలస్యమైంది. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రాంతీయ, సామాజిక సమీకరణాలను సమతుల్యం చేస్తూ అధిష్ఠానం ఈ కేబినెట్ కూర్పును ఖరారు చేసింది. రానున్న వారాల్లో ఈ మంత్రివర్గాన్ని మరింత విస్తరించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# భరత్ రిటైర్మెంట్ ప్రకటించడంతో షాక్‌కు గురయ్యా

## : ఎంఎస్‌కే ప్రసాద్



టీమిండియా వికెట్ కీపర్, ఆంధ్రా క్రికెటర్ కోన శ్రీకర్ భరత్ (కేఎస్ భరత్) అనూహ్యంగా అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. 32 ఏళ్ల వయసులో తన కెరీర్‌కు ముగింపు పలుకుతున్నట్లు గురువారం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రకటించాడు. భారత జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించడం తన జీవితంలో లభించిన గొప్ప గౌరవమని పేర్కొన్న భరత్, ఈ సుదీర్ఘ ప్రయాణంలో తనకు అండగా నిలిచిన బీసీసీఐ, కోచ్‌లు, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి సహచర ఆటగాళ్లతో పాటు తన కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశాడు. భరత్ తీసుకున్న ఈ నిర్ణయం తనను తీవ్ర ఆశ్చర్యానికి గురిచేసిందని టీమిండియా మాజీ చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ పేర్కొన్నాడు. ఒక వార్తా సంస్థతో మాట్లాడుతూ, "భరత్ రిటైర్మెంట్ గురించి విని నేను విస్మయానికి గురయ్యాను. తనతో మాట్లాడి నిర్ణయాన్ని మార్చుకోవాలని నా వంతు ప్రయత్నం చేశాను. కానీ, రిటైర్ కావాలనే నిశ్చయంతో ఉన్నట్లు భరత్ నాతో కచ్చితంగా చెప్పాడు. చిన్నప్పటి నుంచి అతడి ఎదుగుదలను గమనిస్తున్న నాకు ఇది నిజంగా దిగ్భ్రాంతికరమైన విషయం" అని వివరించాడు. భరత్‌లో ఇంకా క్రికెట్ ఆడే సత్తా పుష్కలంగా ఉందని, అయితే అతడి వ్యక్తిగత నిర్ణయాన్ని గౌరవించాల్సిందేనని ఎమ్మెస్కే అభిప్రాయపడ్డాడు. భరత్‌ను తాను అండర్-13 స్థాయి నుంచి గమనిస్తున్నానని ఎమ్మెస్కే తెలిపాడు. తాను కూడా 31 ఏళ్ల వయస్సులోనే రిటైర్మెంట్ ప్రకటించానని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్న ఎమ్మెస్కే... బహుశా భరత్ తన జీవితంలోని ఇతర అంశాలపై దృష్టి సారించాలనుకుంటున్నాడేమోనని వ్యాఖ్యానించాడు. భరత్‌ను ఒప్పించేందుకు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ, అతడు మాత్రం తన నిర్ణయంపై ఎంతో పట్టుదలగా ఉన్నాడని ఎమ్మెస్కే ప్రసాద్ స్పష్టం చేశాడు.

# ఏపీకి పెట్టుబడులే లక్ష్యం: రష్యా వేదికగా లోకేష్ ప్రసంగం



రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ ఆర్థిక ఫోరం (ఫ్రా×జుఖీ) వేదికగా ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రసంగించారు. కేవలం పెట్టుబడిదారులుగానే కాకుండా, రాష్ట్ర అభివృద్ధిలో దీర్ఘకాలిక భాగస్వాములుగా పాలుపంచుకోవాలని రష్యా పారిశ్రామికవేత్తలను, దిగ్గజ సంస్థలను ఆయన సాదరంగా ఆహ్వానించారు.భారత్-రష్యాల మధ్య బంధం కేవలం వ్యాపార ఒప్పందాలకే పరిమితం కాదని, అది ఒక దృఢమైన అనుబంధమని లోకేష్ పేర్కొన్నారు. భిలాయ్ స్టీల్ ప్లాంట్ నుంచి గగన్‌యాన్ ప్రాజెక్టు వరకు అనేక కీలక సందర్భాల్లో రష్యా భారత్‌కు అండగా నిలిచిందని ఆయన గుర్తుచేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నిర్దేశించుకున్న 2030 నాటికి 100 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్య లక్ష్యాన్ని చేరుకోవడంలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషించనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, 2047 నాటికి రాష్ట్ర జీడీపీని 2.5 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యమని వివరించారు. వెయ్యి కిలోమీటర్ల మేర విస్తరించిన సుదీర్ఘ తీరప్రాంతం, ఆరు ప్రధాన ఓడరేవులు, పటిష్టమైన మౌలిక సదుపాయాలు, నిరంతరాయ విద్యుత్ సరఫరా వంటి అంశాలు రాష్ట్రంలో పెట్టుబడులకు ఎంతో అనువైనవని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు.అంతరిక్ష రంగంలో ఇరు దేశాల మధ్య సహకారం నూతన శిఖరాలకు చేరుతోందని, భారత దేశపు ఏకైక స్పేస్‌పోర్ట్ శ్రీహరికోట ఆంధ్రప్రదేశ్‌లోనే ఉందని లోకేష్ గుర్తుచేశారు. ఈ క్రమంలో రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న 'స్పేస్ సిటీల'లో పెట్టుబడులు పెట్టాలని 'రోస్‌కోస్మోస్' వంటి ప్రతిష్టాత్మక సంస్థలను ఆహ్వానించారు. ఏరోస్పేస్, సెమీకండక్టర్లు, ఇంధన రంగాల్లో రష్యన్ సంస్థలకు అపారమైన అవకాశాలు ఉన్నాయని, ఉమ్మడిగా ఉజ్వల భవిష్యత్తును నిర్మిద్దామని ఆయన పిలుపునిచ్చారు.

# ఏపీ రాజ్యసభ సీట్ల పంపకం పూర్తి.. టీడీపీకి 3, జనసేనకు 1



ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు రాజ్యసభ స్థానాలకు సంబంధించి అధికార ఎన్డీఏ కూటమిలో సీట్ల పంపకం ఖరారైంది. కూటమిలోని ప్రధాన పార్టీ అయిన తెలుగుదేశం పార్టీ (టీడీపీ) మూడు స్థానాలను తీసుకోనుండగా, జనసేన పార్టీకి ఒక స్థానాన్ని కేటాయించారు. ఈ సర్దుబాటులో బీజేపీకి ఈసారి అవకాశం లభించలేదు.

ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన కీలక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ భేటీలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఏపీ బీజేపీ అధ్యక్షుడు మాధవ్ పాల్గొన్నారు. ఈ భేటీలో మిత్రపక్ష నేతలతో చర్చించిన అనంతరం, సీట్ల కేటాయింపు నిర్ణయాన్ని సీఎం స్వయంగా వెల్లడించారు.

మూడు పార్టీల నేతల ఏకాభిప్రాయంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. త్వరలోనే రాజ్యసభ అభ్యర్థుల పేర్లను అధికారికంగా ప్రకటిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.రాష్ట్ర అసెంబ్లీలో ఉన్న సంఖ్యా బలం ఆధారంగానే ఈ కేటాయింపులు జరిపినట్లు స్పష్టమవుతోంది. అసెంబ్లీలో టీడీపీకి భారీ మెజారిటీ ఉండగా, జనసేనకు 21 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు.

షెడ్యూల్ ప్రకారం జూన్ 18న నాలుగు రాజ్యసభ స్థానాలకు పోలింగ్ జరగనుంది.

ప్రస్తుతం వైసీపీకి చెందిన మూడు, టీడీపీకి చెందిన ఒక స్థానం ఖాళీ అవుతున్నాయి. అసెంబ్లీలో ఎన్డీఏ కూటమికి ఉన్న పూర్తి ఆధిక్యతతో ఈ నాలుగు స్థానాలనూ గెలుచుకోవడం లాంఛనప్రాయమే.కాగా, నేటి ఎన్డీయే సమావేశంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై కూడా సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు మూడు ప్రాంతాల్లో బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా జూన్ 9న తిరుపతిలో 'సంక్షేమం', 12న అమరావతిలో 'సుపరిపాలన', 15న విశాఖపట్నంలో 'అభివృద్ధి' అనే అంశాలపై సభలు జరపాలని చంద్రబాబు సూచించారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# బాలీవుడ్‌లో అలా.. టాలీవుడ్‌లో ఇలా

## : జాన్వీ కపూర్ ఆసక్తికర వ్యాఖ్యలు



టాలీవుడ్, బాలీవుడ్ చిత్ర పరిశ్రమల పని సంస్కృతిపై నటి జాన్వీ కపూర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలుగు సినిమా సెట్స్‌లో ఇచ్చే గౌరవం, అక్కడి వాతావరణం తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని చెప్పారు. రామ్ చరణ్ సరసన 'పెద్ది' సినిమాలో నటించిన జాన్వీ రెండు పరిశ్రమల మధ్య ఉన్న ప్రధాన వ్యత్యాసాలను పంచుకున్నారు.

క్రియేటివిటీకే ప్రాధాన్యం

తెలుగు చలనచిత్ర పరిశ్రమ పూర్తిగా సినిమాపై ఉన్న ఇష్టం, పట్టుదలతో నడుస్తుందని జాన్వీ కపూర్ అభిప్రాయపడ్డారు. మంచి సినిమా తీయడం కోసమే ఇక్కడి దర్శకులు ప్రాధాన్యం ఇస్తారని చెప్పారు. అవసరమైతే నిర్మాణ సమయాన్ని పొడిగిస్తారని పేర్కొన్నారు. షూటింగ్ షెడ్యూల్స్ కంటే సృజనాత్మకతకే ఎక్కువ విలువ ఉంటుందని వివరించారు. హిందీ పరిశ్రమలో మాత్రం అంతా పక్కా ప్రణాళిక, గడువుల ప్రకారం జరుగుతుందని చెప్పారు. బాలీవుడ్‌లో సమయానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం వల్ల కొన్నిసార్లు కథ విషయంలో రాజీ పడాల్సి వస్తుందని వివరించారు.

భోజన విరామానికి ప్రత్యేక గౌరవం

తెలుగు సినిమా సెట్స్‌లో నటీనటులు, సాంకేతిక నిపుణులను చూసుకునే విధానం అద్భుతంగా ఉంటుందని జాన్వీ ప్రశంసించారు. ఇక్కడ పని వేళలు చాలా పద్ధతిగా ఉంటాయని, అందరికీ తగినంత విశ్రాంతి దొరుకుతుందని చెప్పారు. ముఖ్యంగా లంచ్ బ్రేక్‌ను ఇక్కడ చాలా సీరియస్‌గా తీసుకుంటారని వెల్లడించారు. సెట్స్‌లో అందరూ ప్రశాంతంగా తిని, మళ్లీ ఉత్సాహంగా పని చేసేలా ప్రోత్సహిస్తారని అన్నారు. రోజుకు 9 నుంచి 10 గంటలు మాత్రమే షూటింగ్ చేస్తారని, నైట్ షూట్స్ కూడా తెల్లవారుజామునే ముగించి విశ్రాంతి ఇస్తారని వెల్లడించారు. ముంబైలో ఇలాంటి వాతావరణం కనిపించదని స్పష్టం చేశారు.

చరణ్ ఆసక్తికర వ్యాఖ్యలు

బాలీవుడ్‌లో సినిమాలు చాలా వేగంగా ముగుస్తాయని, ఆ పనితీరు తనకు ఎంతో ఇష్టమని హీరో రామ్ చరణ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. తాము నటిస్తున్న 'పెద్ది' సినిమా కోసమే రెండు సంవత్సరాల కాలంలో సుమారు 285 రోజులు షూటింగ్ చేయాల్సి వచ్చిందని గుర్తుచేశారు. దీనిపై జాన్వీ స్పందిస్తూ బాలీవుడ్‌లో కొన్ని సినిమాలు కేవలం 30 నుంచి 40 రోజుల్లోనే పూర్తయిపోతాయని చెప్పారు. రెండు పరిశ్రమల నిర్మాణ శైలిలో ఎంతో తేడా ఉందని అన్నారు.

## 'ఐరన్ లెగ్' ట్రోలింగ్‌పై కృతి శెట్టి ఘాటు స్పందన




'ఉప్పెన' సినిమాతో రాత్రికి రాత్రే స్టార్ స్టేటస్ సంపాదించుకున్న యువ నటి కృతి శెట్టి, తనపై జరుగుతున్న సోషల్ మీడియా ట్రోలింగ్‌పై ఎట్టకేలకు నోరు విప్పారు. ఉప్పెన తర్వాత 'బంగార్రాజు', 'శ్యామ్ సింగ రాయ్' వంటి చిత్రాలు మంచి విజయాన్ని అందించినప్పటికీ, ఆ తర్వాత ఆమె నటించిన వరుస తెలుగు సినిమాలు బాక్సాఫీస్ వద్ద తీవ్ర నిరాశపరిచాయి. వీటికి తోడు ఇటీవల ఆమె నటించిన తమిళ చిత్రాలు 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ', 'వా వా వాతియార్' కూడా ఆశించిన స్థాయిలో ఆడకపోవడంతో, నెటిజన్లు ఆమెను 'ఐరన్ లెగ్' అంటూ దారుణంగా ట్రోల్ చేయడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఒక తాజా ఇంటర్వ్యూలో మాట్లాడిన కృతి శెట్టి, తనపై వస్తున్న విమర్శలను నేరుగా తిప్పికొడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒక సినిమా ఫ్లాప్ అయితే దానికి హీరోయిన్లను బ్లేమ్ చేయడం చాలా అన్యాయమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. చాలా సినిమాల్లో హీరోయిన్ల పాత్ర నిడివి చాలా తక్కువగా ఉంటుందని, సినిమాను ఎలా తీయాలి లేదా కథను ఎలా నడపాలనే విషయాల్లో తమకు ఎలాంటి నిర్ణయాధికారాలు ఉండవని స్పష్టం చేశారు. అలాంటప్పుడు తమపై 'ఐరన్ లెగ్' అనే ట్యాగ్ వేయడం విచిత్రంగా ఉందని, అసలు పరిశ్రమలో ఒక సక్సెస్‌ఫుల్ సినిమాను ఎలా తీయాలో ఎవరికీ ముందుగా తెలియదని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. కృతి శెట్టి చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు టాలీవుడ్, కోలీవుడ్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. సినిమా ఫ్లాప్ అయితే హీరోయిన్లను మాత్రమే టార్గెట్ చేయడం తప్పు అంటూ ఒక వర్గం ఆమెకు మద్దతు తెలుపుతుండగా, మరో వర్గం మాత్రం దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. సినిమా హిట్ అయినప్పుడు క్రెడిట్ తీసుకునే హీరోయిన్లు, ఫ్లాప్ అయినప్పుడు మాత్రం బాధ్యత తీసుకోరా? అంటూ కొందరు నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. అలాగే సక్సెస్ ఫార్ములా ఎవరికీ తెలియదంటూ కృతి చేసిన వ్యాఖ్యలు సీనియర్ దర్శకులు, నిర్మాతల అనుభవాన్ని తక్కువ చేసి చూపించేలా ఉన్నాయంటూ పరిశ్రమలోని కొందరు అభిప్రాయపడుతున్నారు.

## 72 టేక్స్ నాన్సెన్స్.. సింగిల్ టేక్ యాక్టర్‌ని!



టాలీవుడ్‌లో పాత్ర ఏదైనా దానికి ప్రాణం పోసే యాక్టర్ల లిస్ట్ లో సీనియర్ నటుడు జగపతిబాబు పేరు ముందు వరుసలో ఉంటుంది. హీరోగా కెరీర్ ప్రారంభించి, తరువాత క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, విలన్‌గా, ఎమోషనల్ క్యారెక్టర్లతో ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ఆయన, ఇప్పుడు పెద్ది సినిమాతో మరోసారి తన టాలెంట్ ను చాటుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో వైరలవుతున్న ఓ ప్రచారంపై స్పందించిన జగపతిబాబు, తనపై వస్తున్న అసత్య కథనాలకు ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. అయితే రీసెంట్ గా జగపతిబాబు ఓ సీన్ కోసం ఏకంగా 72 టేక్స్ తీసుకున్నారనే ప్రచారం జరిగింది. ఈ వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో అభిమానుల్లోనూ చర్చకు దారితీసింది. అయితే ఈ విషయంపై స్పందించిన జగపతిబాబు, అలాంటి ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేశారు. ఒక నటుడి పనితీరును అర్థం చేసుకోకుండా ఇలాంటి పుకార్లు సృష్టించడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. సాధారణంగా తాను రెండు టేక్స్‌లోనే సన్నివేశాన్ని పూర్తి చేస్తానని, అత్యవసర పరిస్థితుల్లో మూడో టేక్ మాత్రమే అవసరమవుతుందని వెల్లడించారు. తనపై వచ్చిన పుకార్ల గురించి మాట్లాడుతూ, అదంతా నాన్సెన్స్ అని, పిచ్చి కుక్కలు ఏదోకటి వాగుతుంటాయి, మొరుగుతుంటాయి. అవన్నీ నిజాలెలా అవుతాయని ప్రశ్నించారు. 72 టేక్స్ తీసుకున్నాడని అనడంలో అసలు అర్థముందా అంటూ ఫైర్ అయ్యారు. మ్యాగ్జిమమ్ 3 టేక్స్ తీసుకుంటారు. నా సైడ్ నుంచి 2 టేక్స్ మాత్రమే తీసుకుంటానని చెప్తూ, యాక్టింగ్ లో ఎక్స్‌పీరియెన్స్, పాత్రపై అవగాహన, భావోద్వేగాలను కచ్చితంగా వ్యక్తీకరించే సామర్థ్యం ఉంటే అనవసరంగా ఎక్కువ టేక్స్ అవసరం ఉండదని జగపతిబాబు వ్యాఖ్యానించారు. పెద్ది సినిమా క్లైమాక్స్‌లో సుమారు నాలుగు నిమిషాల పాటు సాగే కీలకమైన సన్నివేశాన్ని ఒకే టేక్‌లో పూర్తి చేశానని చెప్పడం ద్వారా తన ప్రొఫెషనలిజాన్ని ఆయన మరోసారి నిరూపించారు. ముఖ్యంగా ఎమోషన్స్ కు ప్రాధాన్యం ఉన్న సన్నివేశాల్లో కూడా తనకు పాత్రపై పూర్తి పట్టు ఉంటుందని ఆయన మాటల్లో స్పష్టమైంది. జగపతిబాబు కెరీర్‌ను పరిశీలిస్తే, ప్రతి దశలోనూ తనను తాను కొత్తగా ఆవిష్కరించుకున్న నటుడిగా కనిపిస్తారు. హీరోగా గుర్తింపు పొందిన తర్వాత వచ్చిన సవాళ్లను అవకాశాలుగా మార్చుకుని, విలన్ పాత్రల్లో కొత్త ట్రెండ్ సృష్టించారు. లెజెండ్, నాన్నకు ప్రేమతో, రంగస్థలం లాంటి సినిమాల్లో ఆయన చూపించిన యాక్టింగ్ ఇప్పటికీ ప్రేక్షకుల మదిలో నిలిచిపోయింది. ఇప్పుడు పెద్దిలో అప్పలసూరి పాత్ర ద్వారా మరో బలమైన పాత్రను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. అప్పలసూరి క్యారెక్టర్ గురించి మాట్లాడుతూ, తన కెరీర్లోనే ఆ పాత్ర ప్రత్యేకంగా గుర్తుండిపోతుందని, గెటప్ పరంగా, ఎమోషన్స్ పరంగా, యాక్టింగ్ కు ఉన్న స్కోప్ పరంగా ఈ క్యారెక్టర్ తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని తెలిపారు. డైరెక్టర్ బుచ్చిబాబు సానా తన పాత్రను ఎంతో అద్భుతంగా తీర్చిదిద్దారని, ఆ క్రెడిట్ మొత్తం ఆయనకే చెందుతుందని అన్నారు. రామ్ చరణ్‌తో ఇప్పటికే రంగస్థలంలో గుర్తుండిపోయే పాత్రలో కనిపించిన జగపతిబాబు, పెద్దిలో మరోసారి చరణ్ తో స్క్రీన్ షేర్ చేసుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు. సినిమాలో తమ ఇద్దరి పాత్రల మధ్య ఉండే ఎమోషనల్ బాండింగ్ ఆడియన్స్ ను కదిలిస్తుందని జగపతి ధీమా వ్యక్తం చేశారు.

## హీరో విజయ్‌తో రిలేషన్ రూమర్స్.. పరోక్షంగా కౌంటర్ ఇచ్చిన నటి త్రిష!



తమిళనాడు సీఎం, కోలీవుడ్ స్టార్ హీరో విజయ్‌తో నటి త్రిష రిలేషన్‌లో ఉన్నారంటూ వస్తున్న వార్తలు కొన్ని రోజులుగా సినీ, రాజకీయ రంగాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. సాధారణంగా తన వ్యక్తిగత విషయాలపై వచ్చే రూమర్లపై స్పందించని త్రిష, తాజాగా సోషల్ మీడియా వేదికగా పరోక్షంగా స్పందించారు. తన పెంపుడు కుక్క ఫొటోను షేర్ చేస్తూ.. "నా వ్యక్తిగత విషయాల్లో తలదూర్చడానికి దీన్ని మాత్రమే అనుమతిస్తాను" అంటూ ఆసక్తికరమైన క్యాప్షన్ పెట్టారు. నేరుగా ఎవరి పేరు ప్రస్తావించకపోయినప్పటికీ, తనపై అసత్య ప్రచారాలు చేస్తున్న వారికి కౌంటర్‌గానే ఈ పోస్ట్ పెట్టారని అభిమానులు భావిస్తున్నారు.

మరోవైపు, మే నెల జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ త్రిష చేసిన "మ్యాజికల్ మే" పోస్ట్ కూడా నెట్టింట వైరల్ అవుతోంది. ఈ ఏడాది మే నెలను తలచుకున్నప్పుడల్లా తన ముఖంపై చిరునవ్వు వస్తూనే ఉంటుందని ఆమె పేర్కొన్నారు. మే నెలలోనే త్రిష పుట్టినరోజు ఉండడం, అదే సమయంలో తన ఆప్తమిత్రుడు విజయ్ తమిళనాడు ఎన్నికల్లో ఘన విజయం సాధించి సీఎం కావడం విశేషం. దీనికి తోడు ఆమె నటించిన 'కరుప్పు' చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ హిట్‌గా నిలిచి 348 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ఈ వరుస విజయాల వల్లే ఆమె ఈ పోస్ట్ పెట్టారు.

## కృష్ణ ఫ్యాన్స్ ను మెప్పిస్తున్న కుర్రాడి కటౌట్!







తెలుగు ఇండస్ట్రీ ఎప్పటికీ మరిచిపోలేని హీరో కృష్ణ. ఆయన చేసిన సినిమాలే కాదు .. సాహసోపేతమైన నిర్ణయాలు .. ప్రయోగాలు అలా మైలురాళ్లను సెట్ చేసి పెట్టాయి. ఆ ఫ్యామిలీ నుంచి వచ్చిన మహేశ్ బాబు మరో సూపర్ స్టార్ గా తన హవా కొనసాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో మహేశ్ బాబు అన్న రమేశ్ బాబు కొడుకు 'జయకృష్ణ' కూడా హీరోగా ఎంట్రీ ఇవ్వడానికి రెడీ అవుతున్నాడు. 'శ్రీనివాస మంగాపురం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. RX 100' సినిమాతో ఒక భారీ హిట్ ఇచ్చిన అజయ్ భూపతి, ఆ తరువాత కూడా తన మార్క్ సినిమాలను ఆడియన్స్ కి పరిచయం చేశాడు. ఆయన దర్శకత్వం వహించిన 'శ్రీనివాస మంగాపురం' సినిమాతో జయకృష్ణ హీరోగా పరిచయమవుతున్నాడు. యాక్షన్ తో కూడిన రొమాంటిక్ లవ్ స్టోరీ ఇది. రీసెంటుగా వదిలిన ఈ సినిమా 'గ్లింప్స్' చూసినవాళ్ల నుంచి జయకృష్ణకి మంచి మార్కులే పడుతున్నాయి. కటౌట్ కరెక్టుగానే ఉందని చెప్పుకుంటున్నారు. సైడ్ నుంచి అచ్చు రమేశ్ బాబులా కనిపిస్తున్న జయకృష్ణ, నటన పరంగా తనదైన ప్రత్యేకతను చాటుకుంటాడేమో చూడాలి. ఈ సినిమాతో రవీనా టాండన్ కూతురు 'రషా థడాని' హీరోయిన్ గా పరిచయమవుతోంది. బాలీవుడ్ బ్యూటీ అనిపించుకున్న రవీనాకి తెలుగులో 'బంగారు బుల్లోడు' .. 'రథసారథి' వంటి హిట్స్ ఉన్నాయి. ఇక ఇప్పటి యూత్ ను అలరించడానికి రషా థడాని సిద్ధమవుతోంది. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమా, జులై 9వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమాతో ఈ కొత్త జంట దూసుకుపోతుందేమో చూడాలి.

## ఫేక్ కలెక్షన్ పోస్టర్లకు నో చెప్పిన అర్జున్!



సీనియర్ నటుడు, దర్శకుడు అర్జున్ సర్జా తన నిజాయతీని మరోసారి చాటుకున్నారు. తన తాజా చిత్రం 'సీతా పయనం' కోసం ఫేక్ బాక్సాఫీస్ కలెక్షన్ పోస్టర్లు విడుదల చేయాలన్న ప్రతిపాదనను ఆయన నిక్కచ్చిగా తిరస్కరించారు. అవాస్తవ లెక్కలతో సినిమాకు ప్రచారం కల్పించడం తన నైతిక విలువలకు విరుద్ధమని స్పష్టం చేశారు. ఈ సంఘటనతో సినీ వర్గాలు, నెటిజన్ల నుంచి యాక్షన్ కింగ్ పై ప్రశంసల వర్షం కురుస్తోంది. వివరాల్లోకి వెళితే, అర్జున్ స్వీయ దర్శకత్వంలో, శ్రీ రామ్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై 'సీతా పయనం' చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమాలో ఆయన కుమార్తె ఐశ్వర్య అర్జున్ హీరోయిన్‌గా తెలుగు తెరకు పరిచయం కాగా, నిరంజన్ సుధీంద్ర హీరోగా నటించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 14న విడుదలైన ఈ ఎమోషనల్ డ్రామాకు ప్రేక్షకుల నుంచి మంచి టాక్ వచ్చినప్పటికీ, వసూళ్లు మాత్రం సాధారణ స్థాయిలోనే నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో, ఒక మార్కెటింగ్ ఏజెన్సీ అర్జున్‌ను సంప్రదించి, సినిమా విడుదలైన కేవలం నాలుగు రోజుల్లోనే రూ.4 కోట్లు వసూలు చేసినట్లు ఒక పోస్టర్‌ను విడుదల చేద్దామని సూచించింది. అయితే, ఈ ప్రతిపాదనను అర్జున్ వెంటనే తిరస్కరించారు. వాస్తవ వసూళ్లకు, ప్రచార లెక్కలకు పొంతన ఉండాలని, అబద్ధాలతో కూడిన ప్రచారానికి తాను అంగీకరించనని ఆయన తేల్చి చెప్పారు. ప్రస్తుతం సినీ పరిశ్రమలో ఫేక్ కలెక్షన్ పోస్టర్ల ట్రెండ్ ఎక్కువైందని భావిస్తున్న తరుణంలో, అర్జున్ తీసుకున్న ఈ నిర్ణయం ఆదర్శంగా నిలుస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. సినిమా విజయం కోసం అబద్ధపు ప్రచారాలు చేసే సంస్కృతికి భిన్నంగా, హైప్ కంటే నిజాయతీకే విలువనిచ్చిన అర్జున్‌ను అందరూ అభినందిస్తున్నారు.

## గోల్డెన్ డ్రెస్‌లో నేహా శెట్టి మెరుపులు.. 'రాధికా' అందాలకు నెటిజన్లు ఫిదా!





టాలీవుడ్‌లో డీజే టిల్లు సినిమాతో 'రాధికా'గా మెరిసిన నేహా శెట్టి తెలుగు ప్రేక్షకుల గుండెల్లో ప్రత్యేక గుర్తింపు పొందింది. తన సహజమైన నాజూకు అందం, మాయచేసే చూపులతో టాలీవుడ్‌లో ఈ ముద్దుగుమ్మ క్రేజీ గుర్తింపు తెచ్చుకుంది. సినిమాలతోనే కాదు, అప్పుడప్పుడు సోషల్ మీడియాలో అదిరిపోయే ఫోటోషూట్స్‌తో నెటిజన్లకు ఫుల్ విజువల్ ట్రీట్ ఇస్తుంటుంది. తాజాగా నేహా షేర్ చేసిన కొన్ని గ్లామరస్ ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. ఆ ముచ్చట్లేంటో చూసేద్దాం రండి. మెరిసిపోతున్న గోల్డెన్ బ్యూటీ: నేహా శెట్టి తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఫోటోలు చూస్తే ఎవరైనా సరే వావ్ అనాల్సిందే. ఆమె గోల్డ్ కలర్‌లో మెరిసిపోయే ఒక అదిరిపోయే 'షిమ్మరీ నిట్టెడ్ మ్యాక్సీ డ్రెస్' వేసుకుంది. ఇక ఈ అవుట్‌ఫిట్ ఆమె స్లిమ్ బాడీకి పర్ఫెక్ట్‌గా సెట్ అయింది. ఇక బంగారు వర్ణంలో మెరిసిపోతున్న ఈ డ్రెస్‌లో నేహా ఒక దేవకన్యలా కనిపిస్తోందంటూ ఫ్యాన్స్ కామెంట్లు పెడుతున్నారు. హాట్ లుక్‌తో అదరగొట్టిన రాధికా: ఈ డ్రెస్ స్టైల్ విషయానికి వస్తే.. డీప్ వీ-నెక్ లైన్ మరియు స్లీవ్‌లెస్ డిజైన్‌తో చాలా బోల్డ్‌గా, స్టైలిష్‌గా ఉంది. ఇక తన పర్ఫెక్ట్ గ్లామర్‌ను ఎలివేట్ చేస్తూ నేహా ఇచ్చిన పోజులు కుర్రాళ్లకు పిచ్చెక్కించేలా ఉన్నాయి. మోడ్రన్ లుక్‌లోనూ తనదైన సహజమైన మెరుపుతో నేహా అందరినీ కట్టిపడేసింది. చూపు తిప్పుకోనివ్వని చిరునవ్వు: నేహా శెట్టి అందానికి ప్రధాన ఆకర్షణ ఆమె ముఖంలో ఉండే పవిత్రమైన చిరునవ్వు, పదునైన కళ్ళు. ఈ ఫోటోషూట్‌లో కూడా ఆమె తన కళ్లతోనే మ్యాజిక్ చేసింది. ఇక మినిమల్ మేకప్, సింపుల్ హెయిర్ స్టైల్‌తో కేవలం తన కిల్లింగ్ ఎక్స్‌ప్రెషన్స్‌తోనే ఫోటోలకు ప్రాణం పోసింది. అందుకే ఈ ఫోటోలు పెట్టిన కొద్దిసేపట్లోనే లక్షల్లో లైకులు వచ్చాయి. కెరీర్‌లో ఫుల్ జోష్: 'డీజే టిల్లు' బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత నేహా శెట్టికి టాలీవుడ్‌లో వరుస ఆఫర్లు క్యూ కడుతున్నాయి. కేవలం గ్లామర్ రోల్స్ మాత్రమే కాకుండా, నటనకు స్కోప్ ఉన్న పాత్రలను ఎంచుకుంటూ దూసుకుపోతోంది. కమర్షియల్ సినిమాల్లో తనకంటూ ఒక ప్రత్యేకమైన ఇమేజ్ క్రియేట్ చేసుకున్న ఈ బ్యూటీ, రాబోయే ప్రాజెక్టులతో మరిన్ని విజయాలు అందుకోవాలని చూస్తోంది. స్టైల్ ఐకాన్‌గా మారుతూ రోజురోజుకూ తన ఫ్యాన్ బేస్‌ను పెంచుకుంటున్న నేహా శెట్టి, ఈ లేటెస్ట్ గోల్డెన్ లుక్‌తో సోషల్ మీడియాను పూర్తిగా తన వైపు తిప్పేసుకుంది. ఇక గ్లామర్, యాక్టింగ్ కలబోసిన ఈ సుందరి భవిష్యత్తులో టాలీవుడ్‌లో మరిన్ని క్రేజీ రికార్డులు సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది.